

18 నుంచి రైతులకు కొత్త రుణాలు

బొంరాస్‌పేట్, సెప్టెంబరు 13: ప్రభుత్వం రూ.2లక్షల రైతు రుణమాఫీ జరిగిన రైతులకు ఈనెల 18 నుంచి కొత్త రుణాలు అందించనున్నట్లు మెట్లకుంట పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ తెలిపారు. శుక్రవారం పీఏసీఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బుధవారం నుంచి రైతులకు రుణాల ప్రక్రియను వేగవంతం చేయనున్నట్లు తెలిపారు. రైతులు సహకరించి సిబ్బంది సూచించే పత్రాలను అందజేయాలన్నారు.



ఘట్‌కేసర్ ఆసుపత్రిలో రోగుల క్యూ

మేడ్చల్ జిల్లాలో డెంగీ పంజా విసురుతోంది. రోజురోజుకూ కేసులు పెరుగుతుండడంతో బాధితులు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. జిల్లా గ్రామీణ ప్రాంతంలో కేసుల నమోదు తక్కువగా ఉండగా, పట్టణ ప్రాంతంలో ఎక్కువగా నమోదయ్యాయి. డెంగీ విజృంభనతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. పేద, మధ్యతరగతి వారు ప్రవేటు ఆస్పత్రులకు వెళితే ముక్కుపిండి రూ.లక్షలు వసూలు చేస్తున్నారు.





డెంగీ పంజా!

రోగులతో కిటకిటలాడుతున్న ఆస్పత్రులు

అర్బన్ జిల్లాలో అధిక కేసులు నమోదు ▸ ప్రైవేటు ఆస్పత్రులలో చేరితే రూ.లక్షలు లాగుడు

మేడ్చల్, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో డెంగీ జ్వరాలు విజృంభిస్తున్నాయి. రోజురోజుకూ కేసులు పెరుగుతున్నాయి. బాధితులు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. జిల్లాలో జనవరి నుంచి సెప్టెంబరు వరకు 370 కేసులు నమోదు అయ్యాయి. దీంతో జిల్లాలో డెంగీ తీవ్రత ఏ విధంగా విజృంభిస్తుందో అర్థం చేసుకోవచ్చు. ఇందులో జీహెచ్‌ఎంసీ పరిధిలో 265 కేసులునమోదు కాగా, మున్సిపాల్టీల్లో 103, గ్రామీణ ప్రాంతాల్లో 2 కేసులు నమోదయ్యాయి. ప్రభుత్వం డెంగీ జ్వరాలపై సీరియస్‌గా తీసుకుంటున్నా ఇటీవల కేసులు అధిక సంఖ్యలో పెరుగుతున్నాయి. జిల్లాలో గ్రామీణ ప్రాంతంలో కేసుల నమోదు తక్కువగా ఉండగా, పట్టణ ప్రాంతంలో ఎక్కువగా ఉండటం గమనార్హం. జిల్లాలో ఈ నెలలోనే దాదాపు 3 కేసులు నమోదు అయ్యాయి. ఈనెల 13వరకూ జీహెచ్‌ఎంసీ పరిధిలో అధికంగా కేసులు నమోదయ్యాయి. గత నెలలో జీహెచ్‌ఎంసీలో 10 కేసులు, మున్సిపాల్టీల్లో 5కేసులు నమోదయ్యాయి. జిల్లాలో కుత్బుల్లాపూర్ పరిధిలో 6 కేసులు, నారాపల్లి, కీసర, ఉప్పల్, మల్లాపూర్, మచ్చ బొల్లారం, మల్కాజిగిరిలలో ఒక్కోకేసు, బోడుప్పల్‌లో 3 కేసులు నమోదయ్యాయి. జిల్లాలో మురికివాడలు, పారిశ్రామిక ప్రాంతాల్లోనే కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయి. ఈ నెల 13 వరకూ మూడు కేసులు నమోదయ్యాయి.

వైద్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన

వర్షాకాలంలో దోమలు విస్తరించి, సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. దీనిపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మున్సిపల్, గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించడం లాంటి చర్యలు చేపడుతున్నారు. అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ దోమల నివారణకు చర్యలు తీసుకోవడంలో విఫలమౌతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వర్షాకాలంలో చెరువులు, కుంటలు, లోతట్టు ప్రాంతాల్లో కొత్త నీరు చేరి దోమలు వ్యాపించి మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా లాంటి వైరస్ వ్యాపించి వ్యాధులు ప్రబలుతున్నాయి . ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులన్నీ రోగులతో నిండిపోతున్నాయి. వాతావరణంలో వస్తున్న మార్పులతో కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

ఐదేళ్లలో నమోదైన కేసులు

సంవత్సరం	కేసులు
2019	876
2020	173
2021	319
2022	656
2023	745
2024	370

(ఈనెల 13 వరకు)

రోగులతో కిటకిటలాడుతున్న ఆస్పత్రులు

డెంగీ విజృంభనతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. పేద, మధ్యతరగతి వారు ఎక్కువగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో బారులు తీరుతున్నారు. దీంతో ఆస్పత్రుల్లో బెడ్లు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఓపీ కోసం క్యూలో నిలబడక రోగులు సతమతమౌతున్నారు. డెంగీ బారిన పడిన వారు ప్రైవేటు ఆస్పత్రులకు వెళితే రూ. లక్షవరకూ వసూలు చేస్తున్నారు.

జ్వరాలతో ఇబ్బందులు



కొద్ది రోజుల నుంచి మా ఇంట్లో అందరికీ విష జ్వరాలు వచ్చాయి. జలుబు, దగ్గు, తలనొప్పి, జ్వరం వస్తే దాదాపు పదిహేను రోజుల వరకు తగ్గడం లేదు. ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లితే డబ్బులు ఎక్కువగా అవుతాన్నాయని, స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి వెళుతున్నాము.

- బాల్ద రమేష్, మర్రిపల్లిగూడ, ఘట్‌కేసర్ మండలం

చర్యలు చేపడుతున్నాం



జిల్లాలో డెంగీ కట్టడికి చర్యలు చేపడుతున్నాము. ప్రభుత్వాసుపత్రుల్లో వైద్య పరీక్షలకు ఏర్పాట్లు చేశాం. జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఆసుపత్రులకు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలి. జ్వర పీడితులను గుర్తించేందుకు ఇంటింటికి సర్వే కూడా చేపడుతున్నాము. మందులు కూడా ఉచితంగా అందజేస్తున్నాము. ప్రజలకు అవగాహన కార్యక్రమాలు కూడా కల్పిస్తున్నాం. దోమల నివారణకు కూడా చర్యలు తీసుకుంటున్నాము.

- రఘునాథస్వామి, జిల్లా వైద్యాధికారి



వివరాలు సేకరిస్తున్న అధికారుల బృందం

గ్రామాల పేర్లు వాడుక భాషలోనే ఉన్నాయా!

▸ సర్వే ఆఫ్ ఇండియా బృందం

▸ తహసీల్దార్ కార్యాలయంలో సమగ్ర వివరాల సేకరణ

తాండూరురూరల్, సెప్టెంబరు 13: తాండూరు రెవెన్యూ డివిజన్‌లోని గ్రామాలకు సంబంధించిన పేర్లు వాడుక భాషలోనే ఉన్నాయా, ఇతర భాషలోకి ఏమైనా మారాయా అనే దానిపై కేంద్ర సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అధికారుల బృందం సమగ్ర వివరాలు సేకరిస్తోంది. సర్వే ఆఫ్ ఇండియా ప్రతినిధి బాల్‌రాజ్ ఆధ్వర్యంలో 8మంది మండల ప్రణాళిక గణాంక ప్లానింగ్ అధికారుల బృందం తాండూరు తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించారు. రెవెన్యూ డివిజన్‌కు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నారు. నియోజకవర్గంలోని పెద్దేముల్ మండలం ఆత్కూర్ తండాతో పాటు అనుబంధ గ్రామాల వివరాలను రెవెన్యూ అధికారులకు అడిగి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఆయా గ్రామాలకు సంబంధించిన అనుబంధ గ్రామాల వాడుక భాష, గ్రామాల పేర్లు ఇటీవలి కాలంలో మారాయా, మారితే ఏయే పేర్లపై మార్పులు జరిగాయి అనే విషయాలపై నివేదికలు తయారు చేసి ఉన్నతాధికారులకు అందించడం జరుగుతుందన్నారు. గ్రామాలు, పంచాయతీలు, అనుబంధ గ్రామాలుభౌగోళిక మార్పులు సహజసిద్ధంగా ఉన్నాయా, లేక మార్పులు జరిగాయా అనే విషయాలపై సమగ్రంగా సర్వేయర్లతో చర్చించి నివేదికలు తయారు చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీఎస్‌వోలు శ్రీనివాస్, ఆర్.రాజేందర్‌రెడ్డి, ఎం.శ్రీనివాస్, శివకుమార్, వెంకటేశ్, మహేష్ తదితరులున్నారు.

మిషన్ భగీరథ నీరు కలుషితం




దోమ, సెప్టెంబరు 13: దోమ మండలంలోని గోడుగోనిపల్లి, బొంపల్లి తదితర గ్రామాల్లో మిషన్‌భగీరథ తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది. తాగు నీరు కలుషితం కావడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గోదావరి నుంచి సరఫరా అవుతున్నా నీరు వర్షాకాలం వచ్చిందంటే చాలు నీరు ఎర్రగా సరఫరా అవుతోంది. బిందెలు, సంపుల్లోని అడుగు భాగంలో మొత్తం బురద పేరుకుంటుంది. గోడుగోనిపల్లిలో దాదాపు 650 మంది జనాభా ఉన్నారు. ఫిల్టర్‌వాటర్ తాగడంతో పలు రకాల వ్యాధులు సోకుతున్నాయని చాలా మంది మిషన్ భగీరథ నీటినే తాగుతున్నారు. రెండు రోజులుగా తాగు నీరు కలుషితంగా సరఫరా అవుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నీరు కలుషితం కాకుండా సరఫరా చేయాలని కోరుతున్నారు.

ఉల్లినారు ఎండుముఖం

వర్షాలకు తెగిపడిన విద్యుత్ వైర్లు ● నిలిచిన కరెంటు సరఫరా



వాడిపోతున్న ఉల్లినారు



వేలాడుతున్న విద్యుత్ తీగలు

మర్పల్లి, సెప్టెంబరు 13: భారీవర్షాల నేపథ్యంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటుంటే మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీంతో ఉల్లినారుకు నీరు అందక ఎండుముఖం పడుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మర్పల్లి మండలంలోని పంచలింగాల, నర్సాపూర్ చిన్న తండాల్లో రైతులు పెసర, మినుము పంటలు సాగు చేశారు. అవి వానలకు పూర్తిగా దెబ్బతినడంతో తొలగించారు. ఉల్లి పంట వేద్దామని కొద్ది రోజుల క్రితం ఉల్లి విత్తనాలు విత్తారు. భారీవర్షాల నేపథ్యంలో పొలాల్లోని విద్యుత్ తీగలు తెగిపోవడంతో 20 రోజులుగా విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో ఉల్లి నారుకు నీరు అందక ఎండుముఖం పడుతోంది. భారీవర్షాల కారణంగా మరమ్మతులు చేయలేకపోతున్నామని, రేపు మాపు అంటూ విద్యుత్ అధికారులు కాలయాపన చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో ఇప్పటికే సాగు చేసిన పంటలు దెబ్బతిని నష్టం వాటిల్లగా ఉల్లి పంటను సాగు చేసినా అవస్థలు తప్పడం లేదని వాపోయారు. నారు వేసేందుకు వేలాది రూపాయలు ఖర్చు చేశామని రైతులు దిగాలు చెందుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ఉల్లి రైతులు కోరుతున్నారు.

ఎక్కడికక్కడే..

▸ జిల్లాల్లో బీఆర్‌ఎస్ నేతల అరెస్టుల పర్వం

▸ అరెకపూడి, కౌశిక్‌రెడ్డి జగడంతో ముందస్తు చర్యలు

▸ పోలీస్ స్టేషన్లకు కార్యకర్తల తరలింపు



పరిగి పీఎస్ ఎదుట ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వికారాబాద్/మేడ్చల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో పలువురు బీఆర్ఎస్ నేతలను ముందస్తు అరెస్టు చేశారు. పీఏసీ చైర్మన్ అరికపూడి గాంధీ, హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిల మధ్య నెలకొన్న ఘర్షణ వాతావరణం నేపథ్యంలో శుక్రవారం పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేశారు. అరికపూడి గాంధీ ఇంటికి ర్యాలీగా వెళ్లి అక్కడ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహిస్తామంటూ బీఆర్ఎస్ నేతలు పిలుపు నిచ్చిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమై ముందస్తు అరెస్టులు చేశారు. వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా 270 మంది బీఆర్ఎస్ నేతలను అరెస్టు చేయగా, అత్యధికంగా తాండూరు సబ్ డివిజన్ పరిధిలో 97 మంది, పరిగి సబ్ డివిజన్ పరిధిలో 89 మంది, వికారాబాద్ సబ్ డివిజన్ పరిధిలో 84 మందిని అరెస్టు చేశారు. పరిగిలో మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డిని హౌస్ అరెస్టు చేయగా, పోలీసుల వైఖరిని నిరసిస్తూ అక్కడి బీఆర్ఎస్ నాయకులు పోలీసుస్టేషన్ ఆవరణలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై దాడి హేయమని, యుద్ధం ఇప్పుడే మొదలైందని ఇక ముందు బీఆర్ఎస్ ఏంటో చూస్తారని హెచ్చరించారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను ఎక్కడికక్కడే ముందుస్తుగా అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు పలువురు బీఆర్ఎస్ నేతలు ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు శంభీపూర్ రాజు ఇంటికి తరలివెళ్లేందుకు సిద్ధమయ్యారు. అక్కడి నుంచి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ ఇంటి ముట్టడికి వెళ్లేందుకు రెడీ కావడంతో పోలీసులు బీఆర్ఎస్ నాయకులను ముందస్తుగాఅదుపులోకి తీసుకున్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డిని బోయిన్‌పల్లిలోని ఆయన నివాసంలో పోలీసులు ముందస్తుగా హౌజ్ అరెస్టు చేశారు. మల్లారెడ్డి ఇంటి చుట్టూ పోలీసు బందోబస్తు చేపట్టారు.



ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి హౌస్ అరెస్ట్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్

బాధ్యతగా పనిచేయాలి

కొడంగల్, సెప్టెంబరు 13: సమస్యల పరిష్కారానికి అధికారులు బాధ్యతగా పని చేయాలని జిల్లా అటవీ శాఖ అధికారి, ప్రత్యేకాధికారి జ్ఞానేశ్వర్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను సమావేశంలో చదివి వినిపించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీవో ఉషశ్రీ, వ్యవసాయ, ఇరిగేషన్, విద్యుత్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



పనులకు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీత

రోడ్ల నిర్మాణానికి అధిక నిధులు

కీసర రూరల్, సెప్టెంబరు 13: రోడ్ల నిర్మాణానికి అధిక నిధులు కేటాయిస్తున్నట్లు దమ్మాయిగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ వసుపతి ప్రణీత తెలిపారు. మున్సిపల్ పరిధి 8వ వార్డు ఇందిరమ్మ కాలనీలో శుక్రవారం రూ.8లక్షలు, 9వ వార్డు భవానీనగర్‌లో రూ.30లక్షలు, 15వ వార్డు సాయిశ్రీనివాసనగర్‌లో రూ.17లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగమణి, వైస్‌చైర్మన్ నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు స్వప్న, నర్సింహారెడ్డి, సరిత, డీఈఈ చిరంజీవులు, సానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రభు, నాయకులు హరిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ముసాయిదా విడుదల

పంచాయతీల్లో ఓటరు జాబితా రెడీ

▸ గ్రామ సచివాలయాలు, వార్డుల వారీగా ప్రకటన

▸ నేటి నుంచి అభ్యంతరాల స్వీకరణ..

▸ 21వ తేదీ వరకు గడువు

▸ మార్పులు, చేర్పుల ప్రక్రియ అనంతరం..

28న ఓటర్ల తుది జాబితా ప్రకటన

వికారాబాద్/మేడ్చల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియలో కీలకమైన ఓటరు జాబితా ముసాయిదా విడుదల చేశారు. శుక్రవారం వికారాబాద్ జిల్లాలో 585 గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఓటరు జాబితా ముసాయిదాలను ప్రదర్శించారు. ఇంతకు ముందు ఉన్న 566 పంచాయతీలతో పాటు ఇటీవల కొత్తగా ఏర్పాటైన మరో 19 గ్రామ పంచాయతీల్లోనూ ఓటరు జాబితా ముసాయిదాలను ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం సర్పంచ్, వార్డు సభ్యుల పదవుల రిజర్వేషన్లు ఇంకా తేల్చకపోయినప్పటికీ ఎన్నికల సంఘం మాత్రం ముందస్తు ఏర్పాట్లలో నిమగ్నమైంది. గత ఫిబ్రవరి నెల ఒకటో తేదీన పంచాయతీల పాలక వర్గాల పదవీ కాలం ముగియగా, అదేనెల రెండో తేదీ నుంచి పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. గత పంచాయతీ ఎన్నికల్లో గ్రామాల్లో వార్డుల వారీగా ఓటర్ల జాబితా రూపకల్పనలో అక్కడక్కడ పొరపాట్లు చోటు చేసుకున్నాయి. అయితే ఈసారి అలాంటి పొరపాట్లు చోటు చేసుకోకుండా సరిదిద్ది ఓటరు జాబితాలను రూపొందించాలని ఆదేశించిన నేపథ్యంలో ఆ దిశగా చర్యలు చేపట్టారు. గ్రామ పంచాయతీల్లో ప్రదర్శించిన ఓటరు జాబితా ముసాయిదాల్లో ఏవైనా పొరపాట్లు, తప్పులు ఉంటే ఈనెల 21వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. పంచాయతీ కార్యదర్శి దృష్టికి అభ్యంతరాలను రాత పూర్వకంగా తీసుకు వెళితే సరిచేసే విధంగా చర్యలు చేపడతారు. అభ్యంతరాలపై తగు చర్యలు చేపట్టి 28వ తేదీన తుది ఓటరు జాబితాను విడుదల చేయనున్నారు.



మర్పల్లి పంచాయతీ కార్యాలయం నోటీసు బోర్డుపై జాబితాను చూస్తున్న ప్రజలు

టెన్షన్ ... టెన్షన్

గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా ఓటర్ల ముసాయిదా జాబితాలను ప్రకటించేందుకు ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు గత కొన్ని రోజులుగా కసరత్తు చేస్తూ వచ్చారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల వారీగా ఉపయోగించిన ఓటర్ల జాబితాలను పంచాయతీలు, వార్డుల వారీగా విభజించే ప్రక్రియను పంచాయతీ అధికారులు చేపట్టిన విషయం తెలిసిందే. రాష్ట్ర ఎన్నికల సంఘం రూపొందించిన టీ-పోల్ సాఫ్ట్‌వేర్‌లో ఓటర్ల జాబితాలను ఆన్‌లైన్‌లోనే రూపొందించారు. కాగా, సాంకేతిక సమస్యల కారణంగా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ సజావుగా ముందుకు సాగలేదు. గురువారం సాయంత్రం సర్వర్లు మొరాయించడంతో అధికారుల్లో కొంత టెన్షన్ నెలకొంది. ఆ తరువాత పరిస్థితి సానుకూలం కావడంతో సమయానికి ముసాయిదా ఓటరు జాబితాలు ప్రకటించగలిగారు.

పెరగనున్న గ్రామీణ ఓటర్లు

2019లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో వికారాబాద్ జిల్లాలో 5,68,908 మంది గ్రామీణ ఓటర్లు ఉన్నారు. ఆ ఓటర్లలో 2,87,202 మంది పురుషులు, 2,81,706 మంది మహిళలు ఉండగా, మొత్తం గ్రామీణ ఓటర్లలో 3,09,155 మంది బీసీ ఓటర్లు ఉన్నారు. అప్పట్లో జిల్లాలో ఉన్న 565 గ్రామ పంచాయతీల పరిధిలోని ఓటర్లకు, తాజాగా జిల్లాలో గ్రామీణ ఓటర్ల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు ముగియడంతో పట్టణ ప్రాంతాల్లో నమోదైన కొందరు ఓటర్లు తమ ఓటు హక్కును స్వగ్రామాల్లో నమోదు చేసుకున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు వీలుగా ఆయా పార్టీల నేతలు, ఆశావహులు తమ సొంతూళ్లలో ఓటర్లుగా నమోదు చేసుకున్నారు.



యాదారం పంచాయతీ కార్యాలయం వద్ద ఓటరు ముసాయిదాను ప్రదర్శిస్తున్న కార్యదర్శి

33 గ్రామాలే మిగిలాయి

మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలో 61 గ్రామపంచాయతీలుండగా అందులో ఔటర్‌కు సమీపంలో ఉన్న 28 గ్రామాలు సమీప మున్సిపాల్టీల్లో విలీనమయ్యాయి. ఇక మిగిలింది 33 గ్రామాలే. మేడ్చల్, మూడుచింతలపల్లి, శామీర్‌పేట మండలాల్లో మాత్రమే గ్రామాలు మిగిలాయి. కీసర, ఘట్‌కేసర్ మండలాల్లోని గ్రామాలు పూర్తిగా మున్సిపాల్టీల్లో విలీనమయ్యాయి. జిల్లాలో మిగిలిన ఈ 33 గ్రామాలకు జిల్లా యంత్రాంగం ఓటరు ముసాయిదా సిద్ధం చేసింది. ఆ గ్రామాలు కూడా మున్సిపాల్టీలుగా మారుతాయనే ప్రచారం జరుగుతుండగా అధికారులు మాత్రం ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సిద్ధం చేస్తున్నారు.

పోలీసులకు సవాల్‌గా మారిన చోరీ కేసు

- 13 రోజులు గడుస్తున్నా కొలిక్కిరాని వైనం
- పెద్దమొత్తంలో చోరీకావడంతో సర్వత్రా ఉత్కంఠ



రుద్రారం గ్రామంలో చోరీ జరిగిన ఇల్లు

పెద్దేముల్, సెప్టెంబరు 13: మండలంలోని రుద్రారంలో జరిగిన దొంగతనం కేసు పోలీసులకు ఒక సవాల్‌గా మారింది. దొంగలను పట్టుకోవడానికి పోలీసులు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా కనిపిస్తోంది. పోలీసులు మాత్రం ఒక నమ్మకంతో ముందుకు సాగుతున్నారు. దొంగలను పట్టుకుని తీరతామని చెబుతున్నారు. రుద్రారం గ్రామంలో ప్రముఖ సుద్దవ్యాపారి, మాజీ వైస్‌ఎంపీపీ గోపాల్‌రెడ్డి ఇంట్లో ఆగస్టు 30న చోరీ జరిగింది. గోపాల్‌రెడ్డి కుటుంబం ఇంట్లో లేని విషయాన్ని గుర్తించిన దుండగులు చోరీకి పాల్పడ్డారు. సుమారు 20 తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. రూ.14లక్షల పైచిలుకు విలువ కలిగిన బంగారం చోరీకావడంతో దొంగలు ఎప్పుడు దొరుకుతారనే ఉత్కంఠ నెలకొంది. చోరీ జరిగిన తీరు చూస్తే కాస్త భిన్నంగానే కనిపిస్తోంది. సాధారణంగా ఇంట్లో ఎవరూ లేనపుడు చోరీజరిగితే తాళాలు విరగ్గొట్టి దొంగలు ఇంట్లోకి చొరబడతారు. కానీ ఇక్కడ తాళం విరగ్గొట్టలేదు. తాళం చెవితో తాళం తీసి చోరీకి పాల్పడినట్లు తెలుస్తోంది. క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్, క్రైం పోలీసులు వచ్చి విచారణ జరిపినా నేరస్థులను కనిపెట్టలేకపోతున్నారు. చిన్న చిన్న దొంగతనాలు జరిగినపుడు ముద్దాయిలను ఇట్టే పట్టేసిన పోలీసులు ఇక్కడ మాత్రం ఎందుకు వెనుకబడిపోయారనే చర్చసాగుతోంది. చోరీ జరిగిన బీరువాపై గానీ, ఇంటి తలుపులపై గానీ లభించిన వేలిముద్రలు పోలీసుల రికార్డుల్లో ఉన్న నేరస్తుల వేలిముద్రలతో సరిపోవడం లేదనిపిస్తోంది. వేలిముద్రలు గుర్తిస్తే ఈపాటికి నిందితులను పట్టుకుని విచారణ జరిపేవారు. చోరీ జరిగి 13రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు పోలీసులు నిందితులనే గుర్తించలేకపోయారు. చోరీకి సంబంధించి ఎంత మందిని విచారించినా నిందితులకు సంబంధించిన ఎలాంటి సమాచారం పోలీసులు రాబట్టలేకపోయినట్లు సమాచారం. ఏది ఏమైనా ఈ కేసు పోలీసులకు ఒక సవాల్‌గా మారిందనే చెప్పాలి. ఈ కేసును పోలీసులు చేధిస్తారా? లేక అలాగే వదిలేస్తారా? అని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.

కాంగ్రెస్ లీగల్‌సెల్ స్టేట్ జాయింట్ కన్వీనర్‌గా నసీర్ పాషా

మహేశ్వరం, సెప్టెంబరు 13 : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సెల్‌లీగల్ జాయింట్ కన్వీనర్‌గా మహేశ్వరం మండలం మన్‌సాన్‌పల్లికి చెందిన మహ్మద్ నసీర్ పాషాను నియమిస్తున్నట్లు లీగల్‌సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం గాంధీభవన్‌లో నసీర్‌పాషాకు నియామక పత్రం అందజేశారు. నసీర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో జాయింట్ కన్వీనర్‌గా బాధ్యతలు అప్పజెప్పినందుకు నాయకులు, కార్యకర్తలకు న్యాయపరమైన సూచనలు, సలహాలు ఇవ్వడంతో పాటు పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. అదేవిధంగా లీగల్‌సెల్ రాష్ట్ర స్థాయి బాధ్యతలు అప్పజెప్పినందుకు జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల నాయకులకు ప్రత్యేక అభినందనలు చెప్పారు.

విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

వికారాబాద్, సెప్టెంబరు 13: విద్యార్థులు తమలోని ఆత్మన్యూనతా భావాన్ని వీడి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగినప్పుడు విజయం వరిస్తుందని వికారాబాద్ జిల్లా డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షుడు, వికారాబాద్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అన్నారు. వికారాబాద్ క్లబ్‌లో శుక్రవారం వికాస్ కళాశాల ప్రెషర్స్ పార్టీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సమయం వృథా చేసుకోకుండా ప్రణాళికాబద్ధంగా చదివి లక్ష్యాన్ని సాధించాలన్నారు. తల్లిదండ్రులు, గురువుల కలలను సాకారం చేయాలన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విజయం సాధించాలంటే మామూలు చదువులు సరిపోవని, ప్రమాణాలతో కూడిన విద్య అవసరమన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతి కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఉమారాణి, అధ్యాపకులు ప్రభాకర్‌రెడ్డి, రామచంద్రయ్య, కృష్ణ, సురేష్, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, వరలక్ష్మి, శ్రీనివాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

మైనార్టీ యువతకు నైపుణ్య శిక్షణ కోర్సులు

జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి హన్మంతరావు

వికారాబాద్, సెప్టెంబరు 13: ప్రభుత్వ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా చదువుకున్న నిరుద్యోగ మైనార్టీ యువత కోసం నైపుణ్య అభివృద్ధి కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి హన్మంతురావు ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీ, విద్య, ఆరోగ్యం, అకౌంటింగ్(సీఏ, ట్యాలీ, ఐటీ, జీఎస్టీ) హౌసింగ్, పశువుల పెంపకం, డెయిరీ, వెటర్నరీ మొదలైన కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఫ్యాషన్ డిజైనింగ్(టైలరింగ్), అడ్వాన్స్ బ్యూటిఫికేషన్, హార్టికల్చర్, టూరిజం హాస్పిటాలిటీ, ఎయిర్‌హోస్టెస్ క్యాబిన్‌క్రూ, మొదలైన వాటిలో లైట్‌హెవీ మోటార్ డ్రైవింగ్, ఎలక్ట్రీషియన్, ఫైర్ సేఫ్టీ స్వయం ఉపాధి స్మార్ట్‌ఫోన్ హ్యాండ్‌సెట్ రిపేరింగ్, (సాఫ్ట్‌వేర్ హార్డ్‌వేర్) అడ్వాన్స్‌డే మెకనైజ్డ్ ఫర్నిచర్ మ్యానుఫ్యాక్చరింగ్ (ప్యాకేజింగ్ ఇండస్ట్రీ తదితర వాటిలో శిక్షణ ఇచ్చేందుకు నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, టాస్క్, మెప్మా, జీవోఐ బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్, స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ సంస్థలు శిక్షణ ఇస్తాయన్నారు. శిక్షణ సంస్థలు సంబంధిత పత్రాలు, ప్రాజెక్ట్‌రిపోర్టుతోపాటు హార్డ్ కాపీలు వైస్‌ఛాన్సలర్ మేనేజింగ్ డైరెక్టర్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్‌లో అక్టోబర్ 4వ తేదీలోపు హైదరాబాద్ ఆఫీస్ 5వ అంతస్తులోని హజ్‌హౌస్ నాంపల్లిలో దరఖాస్తులను సమర్పించాలన్నారు.

జిల్లాస్థాయి అథ్లెటిక్స్‌లో కొడంగల్ గిరిజన గురుకుల విద్యార్థుల హవా

గోల్డ్ మెడల్ సాధించి రాష్ట్రస్థాయికి ఎంపిక



రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, సిబ్బంది

కొడంగల్ రూరల్, సెప్టెంబరు 13: ఈనెల 12వ తేదీన రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో రంగారెడ్డి జిల్లా అథ్లెటిక్ మీట్-2024లో భాగంగా నిర్వహించిన పోటీల్లో కొడంగల్ మున్సిపల్ పరిధిలోని గిరిజన గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థుల హవా కొనసాగింది. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థి అంగోత్ ప్రవీణ్ షాట్‌పుట్‌ను 10.98 మీటర్ల దూరం విసిరి జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచాడు. అదేవిధంగా డిస్కస్‌త్రో 16.60 మీటర్ల దూరం విసిరి జిల్లాస్థాయిలో రెండవ స్థానంలో నిలిచాడు. లాంగ్ జంప్‌లో 9వ తరగతి విద్యార్థి వికాస్ 4.4 మీటర్లు, బ్యాక్‌త్రోలో 13మీటర్లు, 60 మీటర్ల రన్నింగ్ 8.07సెకండ్లలో చేరుకుని జిల్లా మొదటి స్థానంలో నిలిచాడు. ఖోఖో విభాగంలో 7వ తరగతి విద్యార్థి సేనావత్ రమేశ్ జిల్లా మొదటి స్థానంలో నిలిచాడు. ముగ్గురు విద్యార్థులు గోల్డ్‌మెడల్స్ సాధించడంతో శుక్రవారం పాఠశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు వారిని ఎంతగానో ప్రోత్సహించిన పీడీ గోపాల్, పీఈటీ వెంకటేశ్‌లను సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు చదువుతో పాటుగా క్రీడలపై ప్రత్యేక శిక్షణ పొందుతున్నారని తెలిపారు. అందుకుగానూ పాఠశాల, కళాశాలకు పీడీ, పీఈటీలను ప్రభుత్వం నియమించిందని చెప్పారు.

ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



వికారాబాద్, సెప్టెంబరు 13: తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. ఆయన ఛాంబర్ నుంచి శుక్రవారం టెలికాన్ఫరెన్స్ ద్వారా అన్నిశాఖల అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 17వ తేదీన తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని కలెక్టరేట్ ఆవరణలో ఘనంగా నిర్వహించేదుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఆయా శాఖల వారీగా అధికారులకు ఆదేశాలు జారీచేశారు. వేడుకల నిర్వహణకు అనుగుణంగా వేదిక, సిట్టింగ్ ఏర్పాట్లను పక్కాగా చేసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ చికిత్స అందించేలా వైద్య బృందాన్ని వేడుక స్థలి వద్ద అందుబాటులో ఉంచాలన్నారు. తాగునీటి ఏర్పాట్లు చేయాలన్నారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా వేడుకలు సజావుగా జరిగేలా ఆయాశాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రొటోకాల్‌ను అనుసరిస్తూ అతిథులకు ఆహ్వానాలు పంపాలని సూచించారు. అన్నిశాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, వేడుకలు విజయవంతమయ్యేలా చూడాలన్నారు. జాతీయ భావన పెంపొందేలా విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని డీఈవోకు సూచించారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అసభ్యంగా ప్రవర్తిస్తున్న వార్డెన్లను డిస్మిస్ చేయాలి



పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

షాద్‌నగర్, సెప్టెంబరు 13: పాఠశాలలో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న వార్డెన్లను ఉద్యోగాల నుంచి తొలగించాలని ఎస్ఎఫ్ఐ, ఏఎస్ఎఫ్ఐ సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని మేధా ఇంటర్‌నేషనల్ పాఠశాల ఎదుట ఆయా సంఘాల నాయకులు, విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ నాయకుడు పవన్ చౌహాన్ మాట్లాడుతూ పాఠశాలలో వార్డెన్లుగా ఉన్న రామకృష్ణ, నవ్య రాత్రివేళలో విద్యార్థుల హాస్టల్ గదులకు గొళ్లాలు పెట్టి అసభ్యకరంగా ప్రవహిస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని పసిగట్టిన విద్యార్థులను తీవ్ర భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈమేరకు ఆగ్రహించిన విద్యార్థులు పాఠశాల ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారన్నారు. వారికి మద్దతుగా తాముకూడా విద్యార్థులకు అండగా నిలిచి ధర్నా నిర్వహించామని తెలిపారు.

పెండింగ్ డీఏలను చెల్లించాలి



మాట్లాడుతున్న సదానందం గౌడ్

ఆమనగల్లు, సెప్టెంబరు 12: పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయుల నాలుగు డీఏలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఎస్టీయూటీఎస్ ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్ కోరారు. మెరుగైన ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి, మాడ్గుల మండలం కొల్కులపల్లి, నాగిళ్ల, ఆవురుపల్లి, మాడ్గుల, ఇర్విన్ జడ్పీహెచ్ఎస్‌లను శుక్రవారం సందర్శించారు. ఉపాధ్యాయులతో సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సదానందం మాట్లాడుతూ పదోన్నతులు, బదిలీలు చేపట్టిన ప్రభుత్వం జూలై నెల వేతనాలు నేటికీ అందించకపోవడంతో ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురవుతున్నారని, డీఎస్సీ నియమకాలు పూర్తి చేయాలని, అప్పటి వరకు బోధనకు ఆటంకం కలుగకుండా విద్యా వాలంటీర్లను నియమించాలని విజ్ఞప్తి చేశారు. ఎస్టీయూ సభ్యత్వ నమోదుకు రాష్ట్రవ్యాప్తంగా మంచి స్పందన లభిస్తుందన్నారు. జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు ప్రవీణ్‌కుమార్, సత్తు పాండు రంగారెడ్డి, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సుదాకర్, జిల్లా కోశాధికారి బాల్‌నర్సింహ్మలు, ఎస్టీయూ అధ్యక్షుడు కసిరెడ్డి అశోక్‌రెడ్డి, నాయకులు బాలకృష్ణ, నవీన్ కుమార్, విఘ్నేశ్వర్, శ్రీనివాస్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

జీవో 317 ఉపాధ్యాయులను వెనక్కి పంపించాలి

నవాబుపేట, సెప్టెంబరు 13: జీవో 317 ద్వారా వికారాబాద్ జిల్లాకు పంపిన ఉపాధ్యాయులను వారి సొంత జిల్లాలకు పంపించి నిరుద్యోగ యువతీ, యువకులకు న్యాయం చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.వెంకటరత్నం అన్నారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో శుక్రవారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. జీవో 317 ద్వారా వికారాబాద్‌కు కేటాయించిన ఇతర జిల్లాల ఉపాధ్యాయులను వెనక్కి పంపించాలన్నారు. ఈ జీవోతో నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. కేజీబీవీల్లో రెండవ సీఆర్‌టీ పోస్టులను మంజూర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పవన్‌కుమార్, మండల అధ్యక్షుడు రాములు, ఉపాధ్యక్షుడు వెంకటయ్య, కోశాధికారి అశోక్, జిల్లా కమిటీ సభ్యులు పరమేశ్, వెంకటయ్య పాల్గొన్నారు.

రండి.. సంఘంలో చేరండి

- పొదుపు సంఘంలో కొత్త సభ్యత్వాల నమోదు
- ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా ముందుకు



కులకచర్ల సెర్ఫ్ కార్యాలయంలో మహిళా సభ్యుల సమావేశం

కులకచర్ల, సెప్టెంబరు 13: పొదుపు సంఘాల మహిళలను మరింత చైతన్యవంతులు చేసి సమాంతర వ్యవస్థను నిర్వహిస్తున్న క్రమంలో కొత్త సభ్యత్వాలపై గ్రామీణాభివృద్ధి సంస్థ దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో ప్రతీ మహిళకు సభ్యత్వం ఉండేలా మండల సమాఖ్య, ఐకేపీ అధికారులు చూసుకుంటున్నారు. మండలంలోని 32గ్రామ పంచాయతీల్లో వీవోలు 30మంది ఉండగా గ్రామసమాఖ్య సంఘాలు 968, సభ్యులు 10,026 మంది ఉన్నారు. ఇప్పటి వరకు నూతనంగా ఆరు సంఘాలను ఏర్పాటు చేయగా అందులో 65 మంది చేరారు.

అధికారుల ఆదేశాలు

నూతన సంఘాల ఏర్పాటుకు రాష్ట్రస్థాయి అధికారులు ఇటీవల ఆదేశాలు జారీ చేయడంతో మం డలంలోని సీసీలు అదే పనిలో ఉన్నారు. ప్రతీరోజు గ్రామాలు సందర్శించి మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటి వరకు చేరని వారు లేదా నూతనంగా వివాహమై గ్రామాల్లో ఉన్నవారికి ఈ అవకాశం లభించే అవకాశముంది. నూతనంగా వివాహమైన వారి వివరాలను సేకరిస్తున్నారు. లక్ష్యసాధనకు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు.

వీరికే అర్హత

పేదలు, బీపీఎల్ కుటుంబాల వారు 15నుంచి 60ఏళ్లలోపు ఉన్న వారు కొత్త సంఘంలో చేరేందుకు అర్హులు. వ్యాపారం చేసే వారు, ఉన్నతస్థాయిలో ఉన్నవారు, ఉద్యోగులు అర్హులు కాదని అధికారులు చెబుతున్నారు. ఎలాంటి ఆసరా లేని వారిని సంఘంలో చేర్చుకొని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నంలో భాగమే నూతన సంఘాల ఏర్పాటు. ఈ నేపథ్యంలో మహిళలు సంఘంలో చేరేందుకు ఉత్సాహం చూపుతున్నారు.

అర్హులు చేరవచ్చు



ఇప్పటి వరకు ఏ సంఘంలో లేనివారు, కొత్తగా పెళ్లయిన వారు సంఘంలో చేరేందుకు అర్హులు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. క్లస్టర్ స్థాయిలో ఉన్న సీసీల దగ్గర తమపేర్లు నమోదు చేసుకోవచ్చు.

- శోభ, ఏపీయం, కులకచర్ల



సమావేశంలో మాట్లాడుతున్న చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి



మొయినాబాద్ రూరల్ : కాశీంబౌళిలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే లక్ష్మీనారాయణ

బీఆర్ఎస్ అప్పులు చేస్తే కాంగ్రెస్ మిత్తిలు కడుతోంది

చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

బంట్వారం, సెప్టెంబర్ 13 : గత బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులు చేసి పోతే ప్రస్తుత కాంగెస్ ప్రభుత్వం మిత్తిలు కడుతోందని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ పొరుగు దేశాలకు వెళ్లి దేశంపై విషం చిమ్ముతున్నారని, రాజ్యాంగం రద్దు చేస్తామని చెబుతున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులకు సంబంధించిన లెక్కలు ఆర్థికశాఖ మంత్రి వద్ద లేవన్నారు. ముందు ఇచ్చిన నిధులను ఖర్చు చేయకుండా కొత్త నిధులు అడుగుతున్నారని, ఆ లెక్కలు చెబితే కొత్త నిధులు కేంద్రం ఇవ్వడానికి సిద్ధంగా ఉందన్నారు. గతంలో ఉన్న పథకాలను ఈ ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుకూ నిధులు లేవని ఆయన తెలిపారు. గ్రామాల్లో ఇప్పటి వరకు రైతులకు రెండు లక్షల రుణమాఫీ కాలేదని, దీంతో రైతులు తీవ్రంగా ఆవేదన చెందుతున్నారని అన్నారు. బంట్వారం మండలం వెనుకబడిన మండలంగా ఉందనడానికి ఇక్కడి రోడ్లను చూస్తే అర్థమవుతుందన్నారు. రోడ్లు పూర్తిగా అధ్వాన్నంగా మారి రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమేష్, నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్లనందు, మండల అధ్యక్షుడు మహేష్, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, వెంకటేశం, సుదర్శన్‌రెడ్డి, మల్లేశం, నాగరాజు, రాజు, సుభాష్, జనార్దన్, రాజేందర్‌రెడ్డి, బిచ్చప్ప, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

దేశ ప్రతిష్టను దిగజార్చిన రాహుల్‌గాంధీ

షాబాద్/మొయినాబాద్ రూరల్, సెప్టెంబరు 13 : అమెరికాలో భారత దేశ ప్రతిష్టను దిగదార్చిన రాహుల్‌గాంధీపై దేశద్రోహం కేసు పెట్టాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం షాబాద్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన హాజరైయ్యారు. అంతకుముందు గణేష్ మండపంలో మాజీ ఎమ్మెల్యేలు రత్నం, లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, పీసరి సతీష్‌రెడ్డిలతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. అమెరికాల్లో దేశ ప్రతిష్టను దిగదార్చిన రాహుల్‌గాంధీపై దేశద్రోహం కేసు పెట్టాలన్నారు. దేశ అభివృద్ధిని చూసి ఓర్వలేక భారత్‌పై విషం కక్కుతున్నాడని, శత్రువులు బయటి దేశాల్లో కాదు మన దేశంలోనే ఉన్నారన్నారు. కిరణ్, రాము, శ్రీధర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మహేందర్, మాణయ్య, గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు. అలాగే దేశ రక్షణ బీజేపీతోనే సాధ్యమని యువత ఈ విషయాన్ని గమనించి పార్టీలో చేరాలని విశ్వేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మొయినాబాద్ మండలం కాశీంబౌళిలో పర్యటించారు. నిజామాబాద్, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యేలు లక్ష్మీనారాయణ, రత్నం, కంజర్ల ప్రకాష్, ఓబీసీ జిల్లా కార్యదర్శి వెంకటేష్‌గౌడ్, ఓబీసీ మండలాధ్యక్షుడు అశోక్‌యాదవ్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.



అనురాగ్‌లో హాక్ ఆటాక్ హాకథాన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

'అనురాగ్'లో హ్యాక్ అటాక్ హాకథాన్ రిజిస్ట్రేషన్లు ప్రారంభం

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 13: పోచారం మున్సిపాలిటీ వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో హ్యాక్ అటాక్ హాకథాన్ రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. డిసెంబరు 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు హాకథాన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. హాకథాన్‌లో పాల్గొనం వల్ల విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా ఉపయోగించి సమస్యల పరిష్కారానికి ఎంతగానో దోహదపడుతుందని ఐటీవిభాగం అధ్యాపకులు శేఖర్‌రెడ్డి, ప్రశాంత్‌రావులు తెలిపారు. సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఫిన్‌టెక్, స్మార్ట్‌సిటీ ప్లానింగ్ వంటి రంగాల్లో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మతిభ్రమించి మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి



మహేశ్వరం, సెప్టెంబరు 13 : హైదరాబాద్ మహానగరంతో పాటు తెలంగాణ నలుదిక్కులా ట్రిబుల్ ఆర్, ఫోర్త్‌సిటీ, విద్య, వైద్య రంగాలకు సంబంధించి ఎన్నో అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి శ్రీకారం చుడుతుంటే.. అధికారం కోల్పోవడంతో కొందరు బీఆర్ఎస్ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్లార్) అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో ఆయన మాట్లాడుతూ అధికారం కోల్పోయామనే అక్కసుతో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని, బీఆర్ఎస్ నాయకులపై ఉక్కుపాదం మోపడానికి కాంగ్రెస్ వెనకాడబోదన్నారు. అధికారం ఎప్పటికీ ఎవరి సొంతం కాదని, పేదళ్లు కాంగ్రెస్ నాయకులను, కార్యకర్తలను ఎన్ని అవమానాలకు గురి చేశారో బీఆర్ఎస్ నాయకులు గుర్తుతెచ్చుకోవాలన్నారు. బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై లేనిపోని ఆరోపనలు చేస్తూ.. బురద జల్లాలని చూస్తే రేవంత్ రెడ్డి చూస్తూ ఊరుకోడన్నారు. అప్పటి బీఆర్ఎస్ పాలన మాదిరిగా నిర్బంధాలు చేస్తే ప్రతిపక్ష నాయకులెవరూ రోడ్లపై తిరగలేరన్నారు. వ్యక్తిగత దూషణలు చేస్తే సహించబోమన్నారు. ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి ఫామ్‌హౌస్‌కే పరిమితమైన కేసీఆర్ సూచనలు పాటించి పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రజాపాలనలో ప్రజలు, రైతులు సంతోషంగా ఉన్నారని, ఇది చూసి ఓర్వలేని బీఆర్ఎస్ నాయకులు శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ప్రజాగ్రహానికి గురికాక తప్పదన్నారు.

కుర్మిద్దకు హైదరాబాద్‌గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్

- మేడిపల్లి నుంచి తరలించనున్న అధికారులు
- నెట్‌జీరో సిటీ పేరుతో ఏర్పాటుకు శ్రీకారం



మేడిపల్లిలో కొనసాగుతున్న హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్

యాచారం, సెప్టెంబరు 12 : మండల పరిధిలోని మేడిపల్లిలో గల హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పేరుతో ఉన్న పోలీస్ స్టేషన్‌కు నెట్ జీరో సిటీ పేరిట కుర్మిద్దలో ఏర్పాటుకు ఉన్నతాధికారులు సిద్ధమయ్యారు. కాగా, మేడిపల్లిలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు బాధితులు రాలేక తీవ్ర ఇబ్బందుల పాలవుతున్న విషయమై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో అద్దెభవనంలో ఠాణా శీర్షికన వచ్చిన కథనంపై పోలీస్ ఉన్నతాధికారులు స్పందించారు. చుట్టుపక్కల గ్రామాలకు ఠాణా చాలా దూరం ఉందని ఇంటలిజెన్స్ నివేదికను రాచకొండ పోలీస్ ఉన్నతాధికారులు తెప్పించుకొని జనం గోడు తెలుసుకున్నట్లు సమాచారం. దాంతో మేడిపల్లిలో ఉన్న స్టేషన్‌ను కుర్మిద్దకు మార్చడానికి అధికారులు ముమ్మరంగా యత్నిస్తున్నారు. కుర్మిద్దకు పోలీస్ స్టేషన్ మారిస్తే అన్ని గ్రామాలకు కేంద్ర బిందువుగా ఉంటుందని ఆ శాఖకు చెందిన ఇంటలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు విచారణ చేసి రాచకొండ సీపీకి సమాచారమిచ్చారు. ఈమేరకు కుర్మిద్దలో స్టేషన్‌కు అనువుగా ఉన్న భవనాన్ని పోలీస్ అధికారులు పరిశీలించారు. కందుకూరు మండలంలోని బేగరికంచలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తుండడంతో ఇటు యాచారం, అటు కందుకూరు మండలాల వాసులకు అనువుగా ఉన్నచోట పోలీస్ కుర్మిద్దలో పదెకరాల ప్రభుత్వ భూమి ఉందని, దాంట్లో కొత్త భవనం కట్టించడానికి గానీ, ఫార్మాసిటీ కొరకు సేకరించిన భూమిలో భవనంతో పాటు క్వార్టర్లు కట్టడానికి ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో భూదాన్ భూములు అన్యాక్రాంతం

- నందిగామ భూములపై విచారణ చేపట్టాలి
- మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు



బక్కని నర్సింహులుకు వినతిపత్రం ఇస్తున్న నందిగామ గ్రామస్తులు

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 13: రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో భూదాన్ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నర్సింహులు ఆవేదన వ్యక్తం చేశారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని నందిగామకు చెందిన భూదాన్ భూముల బాధితులు శుక్రవారం బక్కనిని కలిసి తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో బక్కని మాట్లాడారు. వినోభాబావే చేపట్టిన భూదానోద్యమానికి స్పందించి నందిగామ గ్రామానికి చెందిన భూస్వామి లంకాల నారాయణరెడ్డి 99.20 ఎకరాల భూమిని 1956 ఫిబ్రవరి 10న ఇచ్చారని తెలిపారు. ఆ భూమిపై 1975 నవంబర్ 24న భూదాన్ బోర్డు అధికారులు, గ్రామ సర్పంచ్ సమక్షంలో గ్రామ సభ నిర్వహించారని తెలిపారు. 99.20 ఎకరాల భూమిలో 68.22 ఎకరాలను భూమిలేని 18 మందికి పంపిణీ చేశారని తెలిపారు. మిగిలిన భూమి భూదాన్ బోర్డు తన ఆధీనంలో పెట్టుకుందని తెలిపారు. అయితే ఆ భూమిని రైతులు కాస్తూ చేస్తూ అనుభవించాలే తప్ప, ఇతరులకు విక్రయించే హక్కులేదని గుర్తుచేశారు. కొంత భూమిని అనుభవిస్తున్న రైతులు విక్రయించుకోగా, మిగిలిన భూమిని మేకగూడ గ్రామానికి చెందిన రైతులు అక్రమించుకుని విక్రయిస్తున్నారని ఆరోపించారు. చట్ట విరుద్ధంగా భూదాన్ భూములను ఆక్రమించుకోవడమే కాకుండా విక్రయిస్తుంటే రెవెన్యూ అధికారులు ఎలా పట్టామార్పిడి చేస్తున్నారని ప్రశ్నించారు. భూదాన్ బోర్డు ఇచ్చిన పట్టా సర్టిఫికెట్ల ప్రకారం తమకు భూములు ఇప్పించాలని కలెక్టర్లకు, మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసి, కోర్టులను ఆశ్రయించినా నేటి వరకు బాధితులకు న్యాయం జరగడం లేదని గుర్తుచేశారు. సమగ్ర సర్వేచేసి, అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేసి, ఆక్రమదారులను తొలగించి, బాధితులకు ఇప్పించాలని బక్కని డిమాండ్ చేశారు.

టాస్క్ సీవోవోగా సుంకిరెడ్డి బాధ్యతల స్వీకరణ



టాస్క్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరిస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

ఆమనగల్లు, సెప్టెంబరు 13 : టాస్క్(తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్) సీవోవోగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని టాస్క్ కార్యాలయంలో పూజలు చేసి వేదపండితుల ఆ శీర్వాదం అనంతరం బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో కొనసాగే టాస్క్‌కు ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. కాగా, సుంకిరెడ్డికి మే 31న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినా ఆయన అమెరికాలో ఉండటంతో బాధ్యతలు చేపట్టలేదు. వెల్దండ మండలంలోని చౌదర్‌పల్లికి చెందిన సుంకిరెడ్డి వృత్తి నైపుణ్యం కలిగిన యువతను గుర్తించి ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించడానికి రాష్ట్రవ్యాప్తంగా కళాశాలల స్థాయిలో తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



మాట్లాడుతున్న అనురాధ పత్యానాయక్

ఆమనగల్లు, సెప్టెంబరు 13: హామీల అమలులో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ జడ్పీటీసీ, బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకురాలు అనురాధపత్యానాయక్ అన్నారు. ప్రజాపాలన పేరుతో కాంగ్రెస్ ప్రజలను మోసగిస్తుందని ఆరోపించారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 9 నెలలు గడిచినా హామీలు అమలు చేయలేదన్నారు. రైతు బంధు నిలిపివేసి రైతులను వేదనకు గురిచేస్తుందని, నేటికీ 40 శాతం కూడా రుణమాఫీ అమలుకు నోచుకోలేదన్నారు. ఆరు గ్యారెంటీలు హామీలకే పరిమితమయ్యాయని, ఉద్యోగాల కల్పనలో ప్రభుత్వం విఫలమైందన్నారు. విలేఖరుల బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు పత్యానాయక్, నాయకులు ఎంగలి రఘు, సురేందర్ రెడ్డి, చుక్క నిరంజన్ గౌడ్, సరిత పంతూనాయక్, గుత్తి బాలస్వామి, రమేశ్‌నాయక్, దేరంగుల వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



చేవెళ్ల : ముడిమ్యాల్‌లో కంది పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

చేవెళ్ల/మొయినాబాద్ రూరల్, సెప్టెంబరు 13 : కురుస్తున్న వర్షాల నేపథ్యంలో పంటల సాగులో నివారణ చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, మొక్కజొన్న పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లయ్య, ఏరువాక కేంద్రం తాండూర్ కోఆర్డినేటర్ టి.లక్ష్మణ్, శాస్త్రవేత్త యమునలు తెలిపారు. శుక్రవారం చేవెళ్ల మండలంలోని ముడిమ్యాల్, రావులపల్లి, ఎన్కెపల్లి తదితర గ్రామాల్లో మొక్కజొన్న, వరి, కందితోపాటు కూరగాయల పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వారు మాట్లాడుతూ మొక్కజొన్నలో కత్తెర పురుగు, కందిలో ఆకు చుట్టు పురుగు, పత్తిలో వడలు తెగులు, వరిలో పొటాష్ జింకులోపం తదితర వాటిని గుర్తించడం జరిగిందన్నారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలకు యాజమన్య పద్ధతులు పాటించాలని రైతులకు తెలిపారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. పొలాల్లో వర్షం నీరు నిల్వకుండా చూసుకోవాలన్నారు. ఏవోలు శంకర్‌లాల్, అనురాధ, ఏఈవోలు సునీల్, బాలకోటేశ్వరారావు, రైతులు ఉన్నారు. అలాగే మొయినాబాద్ మండలంలోని ఎన్కేపల్లి, అజీజ్‌నగర్ తదితర గ్రామాల్లో శాస్త్రవేత్తలు పర్యటించారు. మొక్కజొన్న, వరి, కంది, కూరగాయల పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మండల వ్యవసాయాధికారి అనురాధ, వ్యవసాయ విస్తరణాధికారులు సునీల్, రైతులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్


వికారాబాద్ పోలీస్ స్టేషన్ వద్ద బీఆర్ఎస్ నాయకులు



మేడ్చల్: మల్లారెడ్డి ఇంటి ఎదుట పోలీసులు


తాండూరు: బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేస్తున్న పోలీసులు



కొడంగల్: అరెస్టయిన బీఆర్ఎస్ నాయకులు

వికారాబాద్, సెప్టెంబరు 13: ఓ వైపు కౌశిక్ రెడ్డి మరోవైపు అరికేపూడి గాంధీ మధ్య జరుగుతున్న గొడవలు ఇందులోహరీష్ రావును అరెస్ట్‌చేయడం హరీశ్‌రావు 10 వేలమంది బీఆర్ఎస్ కార్యకర్తలు హైదరాబాద్‌కు తరలిరావాలని పిలుపునివ్వడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. వికారాబాద్ పట్టణంలో బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్ట్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పలువురిని హౌస్ అరెస్ట్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ. కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకుని అక్రమ అరెస్ట్ చేస్తుందని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై దాడి హేయమైన చర్యగా పేర్కొన్నారు.

పరిగి: ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, కౌశిక్‌రెడ్డిల మధ్య గొడవ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డిని పరిగిలోని ఇంట్లో శుక్రవారం ఉదయం పోలీసులు హౌజ్ అరెస్ట్ చేశారు. మహేశ్‌రెడ్డి హౌజ్ అరెస్టును నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు పరిగి పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. పోలీసుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అరాచకంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. సీపీకి ఫిర్యాదు చేయడానికి వెళితే అక్రమంగా అరెస్టులు చేసి ఇతర ప్రాంతాలకు తరలించడం అప్రజాస్వామికమని విమర్శించారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహించడం దారుణమన్నారు.

పూడూరు: మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని బీఆర్ఎస్ నాయకులను శుక్రవారం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, అరికెపుడి గాంధీ మధ్య జరిగిన వివాదం నేపథ్యంలో మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు అరెస్టులు చేసినట్లు చెన్‌గోముల్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

బంట్వారం: మండలంలో ఎస్ఐ మహిపాల్ రెడ్డి ప్రధాన నాయకుల ఇళ్ల వద్దకు చేరుకుని వారిని అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో బీఆర్ఎస్ నాయకులు ఖాజాపాషా, ప్రవీణ్‌కుమార్, షబ్బీర్, సుదర్శన్, అశోక్, వెంకటేశం ఉన్నారు.

నవాబుపేట: మండల కేంద్రంలో పోలీసులు ముందస్తుగా బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేశారు. ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించకుండా శుక్రవారం పోలీసులు ముందస్తుగా వారిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

తాండూరు: బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం హైదరాబాద్ వెళ్లకుండా పోలీసులు ముందుస్తు అరెస్టు చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అరెస్ట్ అయిన అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజుగౌడ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే వ్యవహారంలో కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. అరెస్టయిన వారిలో సీనియర్ బీఆర్ఎస్ నాయకులు గాదె శ్రీనివాస్‌చారి, ప్రధానకార్యదర్శి అబ్దుల్‌సలీం, యువ నాయకులు సందీప్‌రెడ్డి, దత్తాత్రేయ, హుస్సేన్ ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఇంటివద్ద బీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేశారు.

కొడంగల్: హైదరాబాద్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, అరికెపూడి గాంధీల మధ్య నెలకొన్న రాజకీయ విభేధాల కారణంగా ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించకుండా పోలీసులు ముందస్తుగా పార్టీ నాయకులను అరెస్టు చేశారు. కొడంగల్‌లో శుక్రవారం మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కృష్ణ, కౌన్సిలర్ మధుసూదన్‌యాదవ్ తదితరులను తెల్లవారుజామున అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

బొంరాస్‌పేట్: ఎమ్మెల్యే పాడికౌశిక్‌రెడ్డిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బొంరాస్‌పేట్ మండల అధ్యక్షుడు కోట్లయాదగిరి, మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండలంలో పోలీసులు బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో బీఆర్ఎస్ నాయకులు బండ శ్రీనివాస్, ముస్తాక్, సలీం, జలీల్, సలాం, రవిగౌడ్, రాఘవేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

దౌల్తాబాద్: మండలంలో మాజీ వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, భీములు, వెంకటేశ్ తదితరులను పోలీసులు అరెస్టుచేసి స్టేషన్‌కు తరలించారు. పోలీసులు బలవంతంగా అరెస్టుచేసి స్టేషన్‌కు తరలించడం సరైంది కాదన్నారు.

ధారూరు: బీఆర్ఎస్ మండల నాయకులను గురువారం రాత్రి నుంచి ముందస్తు అరెస్టు చేశారు. ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఇంటి ముట్టడికి బీఆర్ఎస్ పార్టీ పిలుపునివ్వటంతో శుక్రవారం పోలీసులు బీఆర్ఎస్ నాయకులను అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు.

కులకచర్ల: బీఆర్ఎస్ ఎమ్మెల్యేల మధ్య నెలకొన్న రాజకీయ విభేధాల కారణంగా కులకచర్లలో శుక్రవారం పలువురు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టుచేశారు. సాయంత్రం వరకు స్టేషన్‌లో ఉంచి వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్టయిన వారిలో మాజీ వైస్‌ఎంపీపీ రాజేశ్‌గౌడ్, పార్టీ మండల కార్యదర్శి లక్ష్మయ్య, తిరుమలాపూర్ రాములుగౌడ్, రఘు, సత్యయ్యగౌడ్ ఉన్నారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో..

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 13 : బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు ఎమ్మెల్యే అరికి పూడి గాంధీ ఇంటి ముట్టడి కార్యక్రమంలో పాల్గొన తలిచే స్థానిక బీఆర్ఎస్ నేతలను గుర్తించి ముందస్తుగా శుక్రవారం స్థానిక పోలీసులు వారిని అరేస్టు చేసి ఠాణాకు తరలించారు. మేడ్చల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భాస్కర్ యాదవ్, సీనియర్ నాయకుడు అత్వెల్లి సందీప్‌గౌడ్, నడికొప్పు నాగరాజులను పోలీసులు అదుపులో తీసుకున్నారు. తమను అరెస్టు చేయటం పట్ల బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా మండిపడ్డారు.

శామీర్‌పేట: మండలంలోని బీఆర్ఎస్ నాయకులను శుక్రవారం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో శామీర్‌పేట మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, శామీర్‌పేట సహకార సంఘం చైర్మన్ మధుకర్‌రెడ్డి, నాయకులు ఐలయ్యయాదవ్, నర్సింలుగౌడ్, చాంద్‌పాషా, విష్ణువర్ధన్‌రెడ్డి, సతీష్‌రెడ్డి ఉన్నారు.


మేడ్చల్ టౌన్: అరెస్టయిన బీఆర్ఎస్ నాయకులు

ప్రజల అభిరుచులకు అనుగుణంగా వ్యాపారం


విశ్వక్ సేన్‌కు జ్ఞాపికను అందజేస్తున్న సీఎంఆర్ చైర్మన్, ఎండీ వెంకట రమణ

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 13: తెలుగు రాష్ట్రాల ప్రజల అభిరుచులకు అనుగుణంగా కొత్త తరహా వస్త్రాలను సమకూర్చి నాలుగు దశాబ్దాలుగా తమ వ్యాపారాన్ని దిగ్విజయంగా కొనసాగిస్తున్నామని సీఎంఆర్ ఫౌండర్ అండ్ చైర్మన్ మావూరి వెంకటరమణ అన్నారు. మేడ్చల్ పట్టణ బస్టాండ్ ఎదురుగా సీఎంఆర్ 34వ షోరూమ్‌ను శుక్రవారం సినీనటుడు విశ్వక్‌సేన్‌తో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా మావూరి వెంకట రమణ మాట్లాడుతూ.. ఆంధ్ర, తెలంగాణ, ఒరిస్సా రాష్ట్రాల్లో తమ వ్యాపారాన్ని విస్తరింపజేసి కొత్త తరహా దుస్తులను ప్రజలకు విక్రయిస్తున్నామన్నారు. తమ షోరూమ్‌కు వచ్చిన వారికి అన్ని రకాల దుస్తులు లభించే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. ప్రజల వద్ద నుంచి తమకు లభిస్తున్న ఆదరణతో భవిష్యత్తులో తమ శాఖలను మరింత విస్తరింపజేస్తామన్నారు. దుస్తులతో పాటు శుభకార్యాలకు అవసరమయ్యే దుస్తులను తక్కువ ధరలకు అందిస్తున్నట్లు తెలిపారు. తమ సొంత మగ్గాలపై నేసిన వస్త్రాలకు మహిళల్లో డిమాండ్ పెరిగిందన్నారు. షోరూమ్‌లో ప్రతీఒక్కరికి నచ్చే విధంగా వస్త్రాలను సమకూర్చేందుకు కృషి చేస్తున్నామని సీఎంఆర్ ఎండీ మావూరి మోహన్ బాలాజీ అన్నారు.

యువకులను ఉర్రూతలూగించిన సినీనటుడు విశ్వక్‌సేన్


అభిమానులతో మాట్లాడుతున్న నటుడు విశ్వక్‌సేన్

షోరూమ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సినీనటుడు విశ్వక్‌సేన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సీఎంఆర్ చైర్మన్, ఎండీలతో కలిసి షోరూమ్ ప్రారంభించిన విశ్వక్‌సేన్ షోరూమ్‌లోని అన్ని భాగాలను తిరిగి పరిశీలించారు. అనంతరం షోరూమ్ ఎదుట ఏర్పాటు చేసిన వేదికపై అక్కడ విచ్చేసిన యువతీ యువకులను ఉర్రూతలూగించారు. అనంతరం తన ఫ్యాన్స్‌కు ప్రత్యేకంగా బహుమతులు అందజేశారు.

బాల్యం నుంచే విలువలు పెంపొందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న జనార్ధన్

ధారూరు, సెప్టెంబరు 13: బాల్యం నుంచే చిన్నారుల్లో దేశభక్తి, వ్యక్తిత్వ విలువలు పెంపొందించాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఎస్.జనార్ధన్ తెలిపారు. ధారూరులోని కేజీబీవీలో శుక్రవారం కవయిత్రి మొల్ల కళావేదిక తాండూర్ శాఖ ఆధ్వర్యంలో లైఫ్‌స్కిల్స్, టైం మేనేజ్‌మెంట్, గోల్డ్ సెటింగ్, దేశభక్తిపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో తాండూర్ కవయిత్రి మొల్ల కళావేదిక ఫౌండర్ కె.వెంకట్, కేజీబీవీ ప్రిన్సిపాల్ స్రవంతి పాల్గొన్నారు.

శరవేగంగా కాంగ్రెస్ సభ్యత్వాలు


గౌతాపూర్‌లో యువజన కాంగ్రెస్‌లో సభ్యత్వం చేయిస్తున్న సంఘం సభ్యులు

తాండూరు రూరల్, సెప్టెంబరు 13: జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా మహాత్మాగాంధీ బాధ్యతలు చేపట్టి వందేళ్ల పూర్తయిన సందర్భంగా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన సంఘం ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదులు చేపట్టింది. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ తాండూరు డివిజన్ అధ్యక్షుడు అనిల్‌కుమార్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తుపాకుల సుధాకర్ ఆధ్వర్యంలో గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ఆన్‌లైన్‌లో పార్టీ సభ్యత్వ నమోదులకు శ్రీకారం చుట్టారు. మండలంలో 33 పంచాయతీల్లో ఇప్పటి వరకు 30 పంచాయతీల్లో నమోదు చేయగా శుక్రవారం తాండూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జర్నె నాగప్ప ఆధ్వర్యంలో ఆన్‌లైన్ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాంచంద్రారెడ్డి, ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్, కొంపల్లి శ్రీనివాస్, హరికృష్ణ, హజ్మత్, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు

పరిగి, సెప్టెంబరు 13: గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పరిగి ఎంపీడీవో ఎంఎ కరీం అన్నారు. మండలంలోని సయ్యద్‌పల్లి గ్రామాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. పంచాయితీ రికార్డులను పరిశీలించారు. అమ్మఆదర్శ.పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైనేజీలు, పల్లెప్రకృతివనాల్లో పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రంగా ఉంచాలన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రత్యేక అధికారి, కార్యదర్శులు అందుబాటులో ఉండి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి, మాజీ సర్పంచ్ రామకృష్ణారెడ్డి, ఎంపీటీసీ సరళ, టి.వెంకటయ్య, పరమేశ్వర్, పంచాయతీ కార్యదర్శి విజయభాస్కర్ పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధిలో కమిటీల పాత్ర కీలకం

వికారాబాద్, సెప్టెంబరు 13 : పాఠశాలల అభివృద్ధిలో కమిటీల పాత్ర కీలకమని ఎంపీడీవో వినయ్‌కుమార్ అన్నారు. స్త్రీశక్తి భవన్‌లో శుక్రవారం ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలకు విద్యాహక్కుచట్టం, జెండర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీవో మాట్లాడుతూ.. కమిటీలకు అప్పగించిన పాఠశాలల మరమ్మతు పనులను నాణ్యతతో పూర్తి చేసినట్లు తెలిపారు. కమిటీల అధ్యక్షులు ప్రధానంగా బాలికల విద్యపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ భాస్కర్, సిబ్బంది శ్రీనివాస్, వెంకటయ్య, ఉమా పాల్గొన్నారు.

అభివృద్ధి విషయంలో రాజీపడేది లేదు

మేడ్చల్‌టౌన్, సెప్టెంబరు 13: పట్టణంలోని వార్డుల అభివృద్ధి విషయంలో రాజీపడే ప్రసక్తి లేదని మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని 9వ వార్డులో రూ.10లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ వంగేటి లావణ్య హనుమంత్ రెడ్డి, కమిషనర్ నాగిరెడ్డి, డీఈ విజయలక్ష్మి, మాజీ సర్పంచ్ మర్రి నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై హత్యాయత్నం దారుణం

యాలాల, సెప్టెంబరు 13: ఎన్కెపల్లికి చెందిన దళిత యువకుడిపై హత్యాయత్నానికి పాల్పడటం దారుణమని కేవీపీఎస్ జిల్లా నాయకులు ఉప్పలి మల్కయ్య అన్నారు. ఎన్కెపల్లికి చెందిన నట్టల మనోహర్‌ని అదే గ్రామానికి చెందిన అగ్రకులానికి చెందిన బీటీ రాజేందర్, బీటీ మహేందర్, భాస్కర్‌గౌడ్, చెలుక బాలరాజ్ రాము, శ్రీనివాస్ కిడ్నాప్‌చేసి ఇనుప రాడ్‌లు కర్రలతో దాడిచేసి హత్యాయత్నం చేశారని తెలిపారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, ఆ కుటుంబానికి రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కల్యాణలక్ష్మితో పేదలకు భరోసా


లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

నవాబుపేట, సెప్టెంబరు 13: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదలకు అండగా నిలుస్తున్నాయని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 22 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను శుక్రవారం మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జయరాం, పీఏసీఎస్ చైర్మన్ రామ్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్


లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 13: సీఎం సహాయనిధి పేదలకు అండగా నిలుస్తోందని మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి తెలిపారు. పోచారం మున్సిపల్, ప్రతాప్‌సింగారంలోని ఆయన నివాసంలో శుక్రవారం అదే గ్రామానికి చెందిన సాయి కుమార్‌కు రూ.60వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ అబేదాబేగం, నాయకులు బద్దం కుమార్, చంద్ర శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

హిందీ భాషపై పట్టు సాధించాలి


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో

కులకచర్ల, సెప్టెంబరు 13: విద్యార్థులు హిందీ భాషపై పట్టు సాధించాలని, అన్ని సబ్జెక్టులతో పాటు హిందీలో రాణించాలని ఎంఈవో హబీబ్ అహ్మద్ అన్నారు. హిందీ భాషా దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో జాతీయ భాష హిందీ ప్రాముఖ్యతపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. నైపుణ్యం కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం అంజిలయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి మృతి దేశానికి తీరని లోటు


ఘట్‌కేసర్: సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు

వికారాబాద్, సెప్టెంబరు 13: సీపీఎం జాతీయ ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి మృతి సీపీఎం, వామపక్షాలకే కాదు యావత్ దేశానికి తీరని లోటని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.వెంకటరాములు అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో శుక్రవారం మాజీ ఎంపీ సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు వెంకటయ్య, బుస చంద్రయ్య, శ్రీనివాస్, బుగ్గప్ప, రామకృష్ణ, సుదర్శన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరిగి: పరిగిలోని ఆర్టీసీ బస్టాండ్ దగ్గర మెయిన్‌రోడ్డులో శుక్రవారం సీతారాం ఏచూరి చిత్రపటానికి సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బి.చంద్రయ్య, శ్రీనివాస్, యాదగిరి, రఘురాం, శేఖర్‌బాబు, రాచంద్రయ్య, ప్రభు, ఎల్లయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

తాండూరు: అనారోగ్యంతో అకాల మరణం పొందిన సిపిఐ (ఎం) జాతీయ కార్యదర్శి మాజీ పార్లమెంటు సభ్యులు సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి తాండూరులో నివాళులర్పించారు. తాండూరు పట్టణం అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం తాండూరు డివిజన్ సీపీఐ(ఎం) పార్టీ నాయకులు శ్రద్ధాంజలి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకుడి శ్రీనివాస్, సీఐటీయూ నాయకులు నివాళులర్పించారు. బీఆర్ఎస్ నాయకులు, న్యాయవాది గోపాల్ ఆధ్వర్యంలో ఏచూరికి నివాళులర్పించారు.

ఘట్‌కేసర్: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అకాల మరణం దేశానికి తీరని లోటని ఘట్‌కేసర్ రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు బొల్లెపల్లి శ్రీనివాస్, వై.వెంకటేశ్వర్లు అన్నారు. ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ వద్ద శుక్రవారం సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అశోక్, నర్సింహ, సబిత, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి తరలిన వినాయకులు


ఘట్‌కేసర్ రూరల్: క్రేన్‌తో వినాయకున్ని నిమజ్జనం చేస్తున్న సిబ్బంది

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 13: మేడ్చల్ పట్టణంలోని ఆయా ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన వినాయకులను శుక్రవారం నిమజ్జనానికి తరలించారు. మేడ్చల్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో చైర్‌పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డి ప్రత్యేకపూజలు నిర్వహించారు. మున్సిఫ్ సిబ్బంది ఊరేగింపుగా వెళ్లి గణేశుడిని నిమజ్జనం చేశారు.

ఘట్‌కేసర్ రూరల్: ఘట్‌కేసర్ మున్సిపల్, ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువులో వినాయక నిమజ్జనం కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. దీంతో వాహనాల్లో వినాయకులను నిమజ్జనం చేయడానికి తరలిస్తున్నారు. డప్పు వాయిద్యాల మధ్య భక్తుల భజనలు అందరినీఆకట్టుకుంటున్నాయి. అధికారులు రెండు భారీ క్రేన్లను ఏర్పాటు చేసి పెద్ద వినాయకులను క్రేన్‌లో నిమజ్జనం చేస్తున్నారు. చిన్న వినాయకులను బతుకమ్మ ఘాట్ వద్ద నిమజ్జనం చేస్తున్నారు. ఇప్పటి వరకు 648 వినియాకులను నిమజ్జనం చేసినట్లు అధికారులు తెలిపారు.

గణనాథుడి దీవెనలు అందరిపై ఉండాలి

వికారాబాద్: గణనాథుడి దీవెనలు అందరిపై ఉండాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాదవరెడ్డి అన్నారు. పట్టణంలోని కార్తీకేయ నగర్ కాలనీలో శుక్రవారం ఏర్పాటు చేసిన వినాయక మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వికారాబాద్‌లో ఈనెల 17వ తేదీన నిమజ్జనం కార్యక్రమం ఉంటుందని, ప్రజలందరూ ఇందులో పాల్గొని వినాయక విగ్రహాలను సకాలంలో మార్కెట్‌లోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శివరాజ్, రాజేందర్‌రెడ్డి, సతీష్, బుస్సా శ్రీకాంత్, విజయ్‌భాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: మండలంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మండలంలోని టేకులపల్లిలో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో వినాయకుడికి నిత్యపూజలు చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

బొంరాస్‌పేట్: బొంరాస్‌పేట్ మండల కేంద్రంలోని శ్రీవీరభద్రేశ్వరస్వామి ఆలయం వద్ద వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదానం నిర్వహించారు. అదేవిధంగా భూలక్ష్మమ్మ చౌరస్తాలో భక్తులకు అన్నదానం చేశారు.

బాధితులకు ఆర్థిక సాయం

మోమిన్‌పేట్, సెప్టెంబరు 13: మండల కేంద్రానికి చెందిన సంగమేశ్వర్‌కు రెండు రోజుల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు విరిగింది. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ ఒగ్గు మల్లయ్య శుక్రవారం బాధిత కుటుంబానికి రూ.5వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

కులకచర్ల: మండలంలోని రాంనగర్ గ్రామంలో ఈడిగి వెంకటయ్య(65) శుక్రవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి స్పందించారు. గ్రామానికి వెళ్లి కుటుంబానికి తన వంతుగా రూ.5వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, మైపాల్, సాయి తదితరులు పాల్గొన్నారు.


కులకచర్ల: ఆర్థిక సాయం అందజేస్తున్న డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి

గ్రామాల్లో ఓటరు జాబితా వెల్లడి

కులకచర్ల, సెప్టెంబరు 13: మండల పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం ఓటరు లిస్టుల జాబితాను వెల్లడించారు. కార్యదర్శులు జీపీల దగ్గర వార్డుల వారీగా అతికించారు. గ్రామంలోని ఓటర్ల జాబితాను పరిశీలించి తప్పులు, కుటుంబంలోని ఓటర్ల పేర్లు ఇతర వార్డులో ఉంటే సరి చేసుకునేందుకు దరఖాస్తులు చేసుకోవాలని కార్యదర్శులు తెలపారు. అన్నీ గ్రామాల జీపీల దగ్గర ఏర్పాటు చేసిన ఓటరు జాబితాను ప్రజలు పరిశీలిస్తూ కనిపించారు.

నేడు విద్యుత్ అంతరాయం

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 13 : మేడ్చల్ పట్టణం 33/11 సబ్‌స్టేషన్ పరిధిలో చేపడుతున్న మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని విద్యుత్ శాఖ అధికారులు పేర్కొన్నారు. బాలాజీ నగర్, చంద్రానగర్, ఎంఆర్ఆర్ కాలనీ, ఆర్టీసీ కాలనీ, ఏడుగుళ్ల సమీప కాలనీల్లో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారికి నాయకుల సన్మానం


జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారితో బాబురావు, ఎక్బాల్

ధారూరు, సెప్టెంబరు 13: తెలంగాణ పశుసంవర్ధక ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు శుక్రవారం జిల్లా పశుసంవర్ధశాఖ అధికారి డాక్టర్ వి.సదానందంను కలిశారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు బాబు రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎక్బాల్ ఆయనకు శాలువా కప్పి, పూలమాల వేసి శుభాకాంక్షలు తెలిపారు.

మున్సిపల్ సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక చొరవ

ఘట్‌కేసర్, సెప్టెంబరు 13: మున్సిపల్ సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం ఈఎస్ఐ ఆసుపత్రి వైద్యులు మున్సిపల్ సిబ్బందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. సిబ్బంది నిరంతర శ్రమతోనే పట్టణం పరిశుభ్రంగా ఉందన్నారు. వారి కృషి ఫలితంగానే గతంలో రెండు పర్యాయాలు జాతీయ స్థాయిలో క్లీన్‌సిటీ అవార్డులు పొందినట్లు గుర్తుచేశారు. అనంతరం సిబ్బందికి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎండీ సాబేర్ అలీ, ఈఎస్ఐ వైద్యులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత


పట్టుబడిన రేషన్ బియ్యం, పోలీసుల అదుపులో నిందితుడు

బొంరాస్‌పేట్, సెప్టెంబరు 13: మండలంలోని నాగిరెడ్డిపల్లి శివారులో గల దేవనూర్ మార్గంలో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా అక్రమ రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ అబ్దుల్ రవూఫ్ తెలిపారు. పోలీసు సిబ్బంది శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా ఓ వాహనం అనుమానాస్పదంగా కనిపించడంతో పరిశీలించగా అందులో 25 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. తాండూర్‌కు చెందిన వాహన యజమాని, డ్రైవర్ బోయ రమేశ్‌పై కేసు నమోదు చేసి రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.